సాక్షి
రాజన్న సిరిసిల్ల

సోమవారం ; 9 ; డిసెంబర్ ; 2024



వైభవంగా అయ్యప్ప పడిపూజ

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్‌లో మాజీ ఉప సర్పంచ్ కొండ శ్రీనివాస్ గృహంలో ఆదివారం రాజుగురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవం నిర్వహించారు.



అనంతారంలో పోచమ్మ బోనాలు

ఇల్లంతకుంట(మానకొండూర్): అనంతారంలో అన్ని కులసంఘాల ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు తీశారు. మహిళలు బోనాలతో తరలి వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
30.0/22.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడ చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అన్నంలో పురుగులు..మెరిగెలు



హాస్టల్‌ను సందర్శించిన ఏబీవీపీ నాయకులు

సిరిసిల్లటౌన్: అన్నంలో పురుగులు లేదంటే మెరిగెలు.. నీళ్ల చారు.. చన్నీటి స్నానం చేస్తూ ప్రభుత్వ హాస్టల్స్‌లోని విద్యార్థుల పరిస్థితి అని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని బీసీ హాస్టల్స్‌ను ఆదివారం విజిట్ సందర్భంగా మాట్లాడారు. బీసీ హాస్టళ్లలో వసతులు అధ్వానంగా ఉన్నాయన్నారు. బాత్‌రూమ్స్ సరిగా లేవని, మంచి బిల్డింగ్ ఏర్పాటు చేయాలని, చలికాలంలో గీజర్ పనిచేయక విద్యార్థులు చన్నీటి స్నానం చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ లోపెల్లి రాజురావు, ఆశిష్, కార్తీక్, అక్షయ్, విజయ్, గణేష్, భారత్, రోహిత్, పవన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యా పర్యటనకు ఉమెన్స్ డిగ్రీ విద్యార్థులు



పర్యటనకు వెళ్లిన విద్యార్థినులు

వేములవాడరూరల్: వేమువాడ పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఉమెన్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆదివారం విద్యాపర్యటనకు వెళ్లారు. డిజైన్, టెక్నాలజీ కోర్సు విద్యార్థినులు హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(ఎన్ఐఎఫ్‌టీ) పర్యటనకు వెళ్లారు. నిఫ్ట్ క్యాంపస్, వివిధ విభాగాలను అన్వేషించారు.

సర్కారు నిర్ణయం చరిత్రాత్మకం



మాట్లాడుతున్న సంఘం ప్రతినిధులు

సిరిసిల్లటౌన్: సర్కారు నిర్ణయం చరిత్రాత్మకమని జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు జువ్వాజి అమర్‌నాథ్ పేర్కొన్నారు. సిరిసిల్లలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దేశంలోనే తొలిసారిగా ట్రాన్స్‌జెండర్స్, దివ్యాంగుల పెట్రోల్ బంక్‌ను జిల్లాలో ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి భోగ రాజయ్య, అంబటి శ్రీనివాస్, ఊరకొండ లత, మిట్టపెల్లి రమేశ్, గవ్వలపెల్లి సుజాత, ఎండీ సుల్తాన్ పాల్గొన్నారు.

ఇషా జాతీయస్థాయికి ఎంపిక



జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులు

గంభీరావుపేట(సిరిసిల్ల): ఇషా జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు గంభీరావుపేట మండలం కొత్తపల్లి హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 1న హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్‌స్కూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో కొత్తపల్లి విద్యార్థులు ద్వితీయస్థానం సాధించారు. ఈనెల 31 నుంచి తమిళనాడులోని కోయంబత్తూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారు. విద్యార్థులను హెచ్‌ఎం వెంకటరామారావు, జట్టు కోచ్, పీడీ భాను అభినందించారు.

ట్రాఫిక్ తిప్పలు



వేములవాడ: రాజన్న ఆలయం వద్ద ఆదివారం భక్తుల రద్దీ పెరిగిపోవడంతో వాహనాల సంఖ్య సైతం పెరిగింది. దీంతో ప్రధాన రహదారిపై ట్రాఫిక్ తిప్పలు పెరిగిపోయాయి. ఆటోలు అధిక సంఖ్యలో రావడంతో ఆలయం ఎదుట గల ప్రధాన రహదారిపై రద్దీ పెరిగిపోయింది. దీంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు.

రాష్ట్రస్థాయికి ఎంపిక

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సైన్స్‌ఫేర్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఇన్‌స్పైర్ విభాగంలో ఈ.శ్రవణ్‌తేజ, ఆర్బీవీఎస్పీ విభాగంలో సంపత్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.

వడ్డీ ఆశ.. ‘అసలు’కు మోసం !

- రూ.లక్షకు నెలకు రూ.5వేలు వడ్డీ
- మూడు ఘటనల్లో రూ.50కోట్లు ఫట్
- వ్యాపారి అదృశ్యం..కౌన్సిలర్ భర్త ఫోన్ స్విచ్ఛాఫ్.. దంపతుల ఆత్మహత్య..
- కార్మికక్షేత్రంలో ఆర్థిక కల్లోలం



సిరిసిల్ల పాతబస్టాండ్‌లో లక్ష్మీకాంత్ నెలకొల్పిన రెస్టారెంట్

సిరిసిల్ల: కార్మికక్షేత్రం ఆర్థిక కల్లోలంలో చిక్కుకుంది. ఏడాదిగా వస్త్ర పరిశ్రమలో సంక్షోభం.. టెక్స్‌టైల్‌పార్క్ బంద్.. సాంచాలు నడవక.. కార్మికులకు పనిలేక.. ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇవి చాలవన్నట్లు అధిక వడ్డీలను ఆశచూపి కొందరు వ్యాపారులు రూ.కోట్లు సేకరించి ఉడాయిస్తున్నారు. ఫోన్ స్విచ్ఛాఫ్ పెట్టడంతో మిత్తికి ఆశపడితే... ‘అసలు’కే మోసమైందని ఆందోళన చెందుతున్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తాజా ఘటనలు ఆర్థిక సంక్షోభానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఏకంగా రూ.50కోట్లకు ఎగనామం పెట్టే ‘అదృశ్యం’ సంఘటనలతో అప్పులు ఇచ్చిన వారు ఆందోళన చెందుతున్నారు.

ఏం జరిగిందంటే..?

జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్‌కు చెందిన యువకుడు వడ్డెపల్లి లక్ష్మీకాంత్ (36) హైదరాబాద్ కేంద్రంగా హోటళ్లు, రెస్టారెంట్ల వ్యాపారం చేస్తున్నారు. హైదరాబాద్, గజ్వేల్, కొంపల్లి, సుచిత్ర ప్రాంతాల్లో రెస్టారెంట్లు ప్రారంభించాడు. సిరిసిల్ల పాతబస్టాండు సమీపంలోనూ మూడు నెలల క్రితం ‘బీఫోర్ బిల్లెట్’ అనే రెస్టారెంట్‌ను ప్రారంభించాడు. స్థానికంగా పలువురి వద్ద రూ.లక్ష తీసుకుని నెలకు రూ.5వేల చొప్పున వడ్డీ ఇస్తూ నమ్మకంగా ఉన్నాడు. ఈక్రమంలో చాలా మంది లక్ష్మీకాంత్‌ను నమ్మి భారీ మొత్తంలో డబ్బులు ఇచ్చినట్లు సమాచారం. హోటళ్లు, బంకెట్‌హాల్స్, రెస్టారెంట్ బిజినెస్‌లో ఎప్పుడూ బిజీగా ఉంటే లక్ష్మీకాంత్ డిసెంబరు 6న ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. ఢిల్లీ వెళ్లిన లక్ష్మీకాంత్ ఆచూకీ తెలియకపోవడంతో అతని భార్య అర్పిత ఆల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. లక్ష్మీకాంత్ ఫోన్ స్విచ్ఛాఫ్ ఉండడంతో అప్పులు ఇచ్చిన స్థానికులు పలువురు నెహ్రూనగర్‌లోని అతని ఇంటికెళ్లి ఆరా తీశారు. సిరిసిల్ల పోలీసులను ఆశ్రయించారు. లక్ష్మీకాంత్ తండ్రి సైతం పోలీసులను ఆశ్రయించి రక్షణ కోరారు. రెండేళ్ల కిందట సిరిసిల్ల శివారులోని రాజీవ్‌నగర్ మినీ స్టేడియంలో భారీ ఎత్తున సినీ పాటల గాయకులతో ఈవెంట్ షో లక్ష్మీకాంత్ ఆర్గనైజ్ చేశారు. ఈ షో నిర్వహణతో సిరిసిల్ల పట్టణంలో ఆయన పలుకుబడి పెరిగింది. అయితే సడెన్‌గా లక్ష్మీకాంత్ అదృశ్యమవడం చర్చనీయాంశమైంది. సిరిసిల్లతో పాటు హైదరాబాద్‌లోనూ రూ.కోట్లలో అప్పులు ఉన్నట్లు భావిస్తున్నారు. ఆల్వాల్ పోలీసులు లక్ష్మీకాంత్ ఫోన్‌డేటా ఆధారంగా ఆచూకీని కనుగొనే ప్రయత్నం చేస్తున్నారు. ఏదీ ఏమైనా సిరిసిల్లలో చాలా మంది వద్ద అప్పులు తీసుకున్న వ్యక్తి అదృశ్యం కావడంతో కార్మిక క్షేత్రంలో కలకలం రేగింది.

కౌన్సిలర్ భర్త ఫోన్ స్విచ్ఛాఫ్

- సిరిసిల్ల పట్టణంలోని ఓ అధికారపార్టీ కౌన్సిలర్ భర్త ఫోన్ సైతం స్విచ్ఛాఫ్ అయింది. నిజానికి అతను ఆధ్యాత్మికయాత్రలో ఉండగా చాలా రోజులు ఫోన్ పనిచేయకపోవడంతో అప్పులు ఇచ్చిన వారు ఆందోళనకు గురవుతున్నట్లు సమాచారం. అతని వెంట ఆధ్యాత్మికయాత్రకు వెళ్లిన వారితో వాకబు చేస్తూ.. అప్పుల విషయ మై ఆరా తీస్తే స్పందించడం లేదని సమాచారం.
- ఇటీవల సిరిసిల్ల పట్టణంలో దంపతులు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. వారిని సైతం నమ్మి సామాన్యులు రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు అప్పులు ఇచ్చిన వారు అయోమయానికి గురయ్యారు. దంపతులు ఇద్దరూ ఆత్మహత్య చేసుకోవడంతో ఎవరిని డబ్బులు అడగాలో తెలియని పరిస్థితి.
- అంతకుముందు మరో వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడగా.. అతన్ని నమ్ముకుని అప్పులు ఇచ్చిన వారు తలపట్టుకుంటున్నారు.

సిరిసిల్లలో ఐపీ భయం

వడ్డీ చెల్లిస్తామని నమ్మకంగా అప్పులు పొందిన పలువురు దివాళా తీయడంతో ఐపీలు దాఖలు చేసే ప్రమాదం ఉంది. సిరిసిల్లలో అప్పులు ఇచ్చిన పలువురిని ఐపీ భయం వెంటాడుతోంది. వడ్డీ ఆశకు అప్పులు ఇస్తే.. అసలుకే ఎసరు వచ్చిందని వాపోతున్నారు. మరోవైపు కోర్టు నుంచి ఐపీ నోటీసులు వస్తే.. ఊరిలో పరువుపోతుందని భయపడుతున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా వడ్డీ వ్యాపారులపై పోలీసులు దాడులు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నారు. ఏది ఏమైనా సిరిసిల్లలో తాజాగా ఈ దివాళా ఘటనలు ఆర్థిక కల్లోలాన్ని సృష్టిస్తున్నాయి.

రెచ్చిపోతున్న దొంగలు



నారాయణపూర్ గ్రామం

- నెల రోజుల్లో 10 సంఘటనలు
- మూలనపడ్డ సీసీ కెమెరాలు
- వలసకార్మికులపైనే అనుమానాలు
- వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. పట్టపగలే ఇళ్లను టార్గెట్ చేసుకొని రెక్కి నిర్వహిస్తూ రాత్రి వేళ దోచుకెళ్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 255 గ్రామాల్లోని సగం కంటే ఎక్కువ గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. ఫలితంగా దొంగలు చిక్కడం లేదు. దొంగతనాలను ఛేదించడంలో పోలీసులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఇటీవల కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాన్ని తీసుకొని సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలోని ఒక్క ఎల్లారెడ్డిపేట మండలంలో నెలరోజుల వ్యవధిలో 10 సంఘటనల్లో పలు ఆలయాలు, ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. వరుస దొంగతనాలతో ప్రజలకు కంటిమీద కునుకులేకుండా పోతుంది. పోలీసుల రాకపోకలు, పెట్రోలింగ్ చేస్తున్న ప్రాంతాలను ముందే గుర్తించి మరో ప్రాంతంలో చోరీలకు పాల్పడడం కలవరం పెడుతోంది. తాజాగా అల్మాస్‌పూర్‌లో తాళం వేసి ఉన్న లిక్కిడి పద్మ, ఉచ్చిడి కిషన్‌రెడ్డి ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారు. అంతకుముందు వెంకటాపూర్‌లో మరాఠి లచ్చవ్వ ఇంట్లో దొంగతనం చేశారు. 20 రోజుల క్రితం పోతిరెడ్డిపల్లిలోని పెద్దమ్మ ఆలయంలో చోరీకి పాల్పడి అమ్మవారి ఆభరణాలు లూటీ చేశారు.

పనిచేయని సీసీ కెమెరాలు

జిల్లా వ్యాప్తంగా 255 గ్రామపంచాయతీల్లో సుమారు 65శాతం గ్రామాల్లో ప్రజలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. కెమెరాల నిర్వహణపై పట్టింపు లేకపోవడంతో సగానికి పైగా సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. జిల్లాలో 1225కు పైగా సీసీ కెమెరాలను గతంలో ఏర్పాటు చేశారు. అయితే ఇందులో వెయ్యికి పైగా సీసీ కెమెరాలు పనిచేయడం లేదని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు సీసీ కెమెరాల నిర్వహణపై దృష్టి పెట్టాలని పోలీస్ అధికారులు సూచిస్తున్నారు.

వేలిముద్రల సేకరణలో పోలీసులు

జిల్లాకు ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వలస కార్మికుల రాక పెరిగింది. భవన నిర్మాణాల పనులు జోరందుకోవడం, వ్యవసాయ పనులు ఊపందుకోవడం, కోళ్లషెడ్లలో పనిచేసేందుకు స్థానికంగా కూలీల కొరతతో బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ నుంచి వేలాది మంది కార్మికులను ఇక్కడికి తీసుకొస్తున్నారు. తమ వద్ద ఉన్న కార్మికుల సమాచారాన్ని కాంట్రాక్టర్లు స్థానిక అధికారులకు ఇవ్వడం లేదు. గత పదిహేను రోజులుగా జిల్లాలో జరుగుతున్న దొంగతనాల నేపథ్యంలో వలసకూలీల వివరాలు, వేలిముద్రలు సేకరిస్తున్నారు.



ఇది ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌లోని లిక్కిడి పద్మ ఇంట్లోని బీరువా పరిస్థితి. మూడు రోజుల క్రితం దొంగలు పడి బీరువాలోని విలువైన వస్తువులు, రూ.15వేల నగదు ఎత్తుకెళ్లారు. గ్రామంలో సీసీ కెమెరాలు లేకపోవడంతో వారి ఆచూకీని తెలుసుకోవడంలో పోలీసులు ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజులు గడుస్తున్నా దొంగల ఆచూకీ తెలియడం లేదు. ఇలా మండలంలో నెల రోజుల వ్యవధిలో 10 దొంగతనాలు జరిగాయి. వరుస దొంగతనాలతో జనం వణికిపోతున్నారు.

నిఘా తీవ్రం చేశాం



వరుస దొంగతనాల నేపథ్యంలో నిఘా తీవ్రతరం చేశాం. అల్మాస్‌పూర్, పోతిరెడ్డిపల్లి, వెంకటాపూర్‌లో జరిగిన దొంగతనంపై విచారణలో భాగంగా వేలిముద్రలు సేకరించాం. పలు ఆలయాల్లో దొంగతనానికి పాల్పడిన దొంగలను పట్టుకున్నాం. గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేయని కారణంగా నిందితులు సులభంగా తప్పించుకోగలుగుతున్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అపరిచిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

– రమాకాంత్, ఎల్లారెడ్డిపేట ఎస్సై

గ్రూప్–2 అభ్యర్థులు నిబంధనలు పాటించాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- నిమిషం ఆలస్యమైనా అనుమతి నో



సందీప్‌కుమార్ ఝా, కలెక్టర్

సిరిసిల్ల: గ్రూప్–2 అభ్యర్థులు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనలు పాటించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. ఆదివారం పలు వివరాలు వెల్లడించారు. ఈనెల 15, 16 తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు రెండు సెషన్లు గ్రూప్–2 పరీక్షలు జరుగుతాయని, అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. ఈనెల 9 నుంచి అభ్యర్థులు తమ హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు.

నిమిషం ఆలస్యమైనా...

పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులను ఉదయం సెషన్‌లో 8.30 నుంచి, మధ్యాహ్నం సెషన్‌లో 1.30 గంటల నుంచి అనుమతిస్తారని, పరీక్ష కేంద్రాల గేటును ఉదయం 9.30 గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు మూసివేస్తారని కలెక్టర్ స్పష్టం చేశారు. తర్వాత పరీక్ష కేంద్రాలకు ఎవరిని అనుమతించబోరని స్పష్టం చేశారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు తమ వెంట బ్లూ/బ్లాక్ పాయింట్ పెన్నులు, ఫొటోతో కూడిన హాల్‌టికెట్, ప్రభుత్వం జారీచేసిన ఒరిజినల్ ఫొటో ఐడీకార్డ్ తీసుకొని రావాలని, హాల్‌టికెట్‌పై పాస్‌పోర్టు సైజు ఫొటో ముద్రించి తీసుకొని రావాలని సూచించారు. హాల్‌టికెట్‌లో ఫొటో సరిగ్గా లేకపోతే అభ్యర్థి మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు గెజిటెడ్ అధికారి లేదా చివర చదివిన విద్యాసంస్థ ప్రిన్సిపల్ సంతకంతో తీసుకొచ్చి పరీక్షాహాల్‌లో ఇన్విజిలేటర్‌కు అప్పగించాలని తెలిపారు.

ముందే పరీక్ష కేంద్రాన్ని చూసుకోవాలి

అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ఒక రోజు ముందు వచ్చి చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. క్యాలిక్యులేటర్, సెల్‌ఫోన్, పెన్‌డ్రైవ్, బ్లూ టూత్ డివైసెస్, జ్యువెల్లరీ, ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లను అనుమతించబోమన్నారు. అభ్యర్థులు చెప్పులు మాత్రమే వేసుకోవాలని సూచించారు. బయోమెట్రిక్ పూర్తయ్యే వరకు అభ్యర్థులు పరీక్షహాల్ విడిచి వెళ్లరాదని, బయోమెట్రిక్ ఇవ్వని అభ్యర్థుల ఓఎంఆర్ షీట్ వ్యాలిడ్ కాదని, బయోమెట్రిక్ విధానం ఉన్న నేపథ్యంలో అభ్యర్థులు మెహెందీ టాటూ వంటివి పెట్టుకోవద్దని కోరారు.

హద్దుమీరుతున్న గల్లీ వైద్యం

- నిబంధనలు పాటించని ఆర్ఎంపీ, పీఎంపీలు
- కమీషన్‌ల కోసం కార్పొరేట్‌కు రెఫర్
- కొందరి తీరు.. అందరికీ చెడ్డ పేరు



ఆర్ఎంపీ క్లినిక్‌లో తనిఖీ చేస్తున్న మెడికల్ కౌన్సిల్ మెంబర్

సిరిసిల్లటౌన్: పల్లెప్రజలకు వైద్యసేవలు అందించడంలో ఆర్ఎంపీలు ముందుంటారు. గ్రామాల్లో అన్ని వేళల్లో అందుబాటులో ఉంటూ వైద్యం అందిస్తున్నారు. అయితే కొందరి తీరుతో అందరికీ చెడ్డ పేరు వస్తుంది. అత్యధిక సంఖ్యలో ఆర్ఎంపీలు తమ వద్దకు వచ్చే రోగులకు మందులు, సూదులు ఇచ్చి బాగుచేస్తుంటే..మరికొందరు ప్రైవేట్ ఆస్పత్రులతో కుమ్మక్కై కమీషన్ల కోసం కార్పొరేట్ ఆస్పత్రులకు తీసుకెళ్తున్నారు. చిన్నపాటి అనారోగ్యానికి పదుల సంఖ్యలో వైద్యపరీక్షలు చేసి వేలల్లో బిల్లులు వేసి కమీషన్లు పొందుతున్నారు. ఇలాంటి వారి కొందరి తీరుతోనే నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్న మిగతా ఆర్ఎంపీలకు చెడ్డపేరు వస్తుంది. ఇది ఇటీవల జరిగిన మెడికల్ కౌన్సిల్ దాడులతో బయట పడింది.

ఆర్ఎంపీలు పాటించాల్సిన నిబంధనలు

- ఆర్ఎంపీలు ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు ఏర్పాటుచేసి ప్రాథమిక వైద్యం అందించాలి.
- ఎట్టి పరిస్థితుల్లో వారి ఆస్పత్రుల్లో బెడ్స్ ఏర్పాటు చేయరాదు.
- ఆర్ఎంపీలు బోర్డులపై తమ పేరు ముందు డాక్టర్ అని రాయించుకోరాదు.
- యాంటిబయాటిక్స్ ఇవ్వాల్సి వస్తే రోగులను ఎంబీబీఎస్ వైద్యుల వద్దకు పంపించాలి.
- కొందరు ఆర్ఎంపీలు తమ పేరుతో రోగులకు రక్త, మల, మూత్ర, ఇతర పరీక్షలు రాస్తుంటారు. ఇది నిబంధనలకు విరుద్ధం.
- ఆర్ఎంపీలు ఎలాంటి మెడికల్ షాపులు, పాథలాజికల్ ల్యాబులు నిర్వహించరాదు.

ఆర్ఎంపీల సేవలు ఇలా..

- బీపీ చెకప్ చేయాలంటే, రోగిని పడుకోబెట్టి పరీక్షించాల్సి ఉంటుంది. కానీ ఆస్పత్రిలో బెడ్ లేకుంటే ఎలా అని వారు ప్రశ్నిస్తున్నారు.
- జిల్లాలో 600 మంది ఆర్ఎంపీలు ఉన్నారు. వారిలో సుమారు 500 మంది కమ్యూనిటీ పారామెడికల్ ట్రెనింగ్‌ను 2005లో తీసుకున్నారు. అప్పటి సీఎం వైఎస్సార్ హయాంలో ట్రైనింగ్ పూర్తయింది.

ఆంక్షలు సరికాదు



మేము వైఎస్సార్ హయాంలో కమ్యూనిటీ పారామెడికల్ ట్రెనింగ్ పూర్తిచేశాం. పరీక్ష నిర్వహించి ఉంటే బాగుండేది. ప్రస్తుత సీఎంకు కూడా మా అవస్థలపై వినతిపత్రం ఇచ్చాం. ఇటీవల మెడికల్ కౌన్సిల్ మెంబర్లు ఆర్ఎంపీల కేంద్రాల్లో దాడులు చేశారు. పేదల కోసం గల్లీవైద్యంలో 24 గంటలు ముందుండేది మేమే. మా ఇబ్బందులు కూడా పట్టించుకోవాలి. ఎవరో కొందరు నిబంధనలు పాటించకపోతే అందరినీ దోషులు చేయొద్దు.

– కుడిక్యాల రవికుమార్, సిరిసిల్ల పట్టణ ఆర్ఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు

నిబంధనలు పాటించాల్సిందే..



ఆర్ఎంపీలు, ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు నిబంధనలు పాటించాల్సిందే. కొంతమంది ఆర్ఎంపీలపై వస్తున్న ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటాం. జిల్లాలోని అన్ని మండలాల్లోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ అందుబాటులో ఉన్నారు. ఆరోగ్య ఇబ్బందులు ఉంటే ఆరోగ్య కేంద్రాలకు వెళ్లండి. ప్రైవేటు ప్రాక్టీషనర్స్ తమ ఆస్పత్రుల్లో సేవలపై బోర్డులు ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ వసంతరావు, డీఎంహెచ్‌వో

మనీ పవర్ కాదు.. మైండ్ పవర్ చూపిద్దాం

- 16 ఏళ్లుగా నిరుద్యోగుల సేవలో ఉన్నా
- పట్టభద్రుల గొంతుకగా నినదిస్తా
- ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ



మాట్లాడుతున్న ప్రసన్న హరికృష్ణ

సిరిసిల్లకల్చరల్/సిరిసిల్ల ఎడ్యుకేషన్: రానున్న శాసన మండలి ఎన్నికల్లో మనీ పవర్‌కు బదులుగా మైండ్‌పవర్ చూపించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ కోరారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కల్యాణలక్ష్మీ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరై మాట్లాడారు. పదహారేళ్ల అధ్యాపక జీవితంలో వచ్చిన ఆదాయంలో 30 శాతం పట్టభద్రుల ప్రగతి కోసమే కేటాయించానన్నారు. వేలాది మంది నిరుద్యోగులు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ శిక్షణతో ఎంతో మంది స్థిరపడ్డారన్నారు. 19 ఏళ్ల ఉద్యోగ జీవితాన్ని త్యాగం చేసి మరీ ఎన్నికల బరిలో నిలుస్తున్నానని, నిరుద్యోగుల గొంతుకగా నిలుస్తానని పేర్కొన్నారు. అంతకుముందు 300 మందితో తంగళ్లపల్లి వంతెన నుంచి బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాతీయ, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న సంపత్‌కుమార్, పాకాల శంకర్‌గౌడ్‌లను సన్మానించారు. రిటైర్డ్ లెక్చరర్ గాజుల ప్రతాప్, లక్ష్మణ్‌రావు, పెన్షనర్ల సంఘం రాష్ట్ర బాధ్యులు లక్ష్మణ్‌రావు, జన విజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు ఆకునూరి శంకరయ్య, రిటైర్డ్ ఎంఈవో రామరాజు, వంశీకృష్ణ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వంశీకృష్ణ, యువజన విభాగం ప్రతినిధి వినోద్ పట్టభద్రులు పాల్గొన్నారు.

వైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: వైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ వైశ్య సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన సిద్ధంశెట్టి వేణు ప్రమాణస్వీకారం ఆదివారం జరిగింది. విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతికి వైశ్యులు రాజకీయంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా వైశ్య సంఘం అధ్యక్షుడు బుస్స దశరథం, మున్సిపల్ వైస్‌చైర్మన్ బింగి మహేశ్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం గౌడ్, ఏఎంసీ చైర్మన్ రొండి రాజు, అల్లాడి రమేశ్, బాశెట్టి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అంతటా వర్షం



సిరిసిల్లటౌన్/వేములవాడ: జిల్లాలో ఆదివారం భారీ వర్షం కురిసింది. భారీ వర్షం ధాటికి సిరిసిల్ల పట్టణంలోని పాతబస్టాండు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చిన భక్తులు తడిసిముద్దయ్యారు. బోయినపల్లిలో 31.5 మి.మీ, వేములవాడలో 23.0, కందికట్కూర్ 22.0, సిరిసిల్లలో 19.3, వీర్నపల్లిలో 17.5, నిజామాబాద్‌లో 16.3, మర్తనపేటలో 13.3, ఇల్లంతకుంటలో 11.8, ఆవునూరులో 7.8, పెద్దూరులో 6.5, నేరెళ్లలో 5.8, మల్లారంలో 4.5, నామాపూర్‌లో 3.3 మి.మీ వర్షపాతం నమోదైంది.

క్లుప్తంగా

అనారోగ్యంతో మాజీ ఎంపీపీ భర్త మృతి


గణేశ్(ఫైల్)

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ మండలం గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన తాజా మాజీ ఎంపీపీ భర్త జవ్వాజి గణేశ్(48) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గణేశ్ గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. శనివారం సాయంత్రం పరిస్థితి విషమించడంతో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. కాగా, మాజీ ఎంపీపీ జవ్వాజి రేవతిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, మాజీ జెడ్పీటీసీ నాగం భూమయ్య, బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు.

గుండెపోటుతో బుగ్గారం ఎంపీడీవో..


శ్రీనివాస్ (ఫైల్)

బుగ్గారం(ధర్మపురి): జగిత్యాల జిల్లా బుగ్గారం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న మాడిశెట్టి శ్రీనివాస్(60) గుండెపోటుతో మృతిచెందారు. శనివారం ఎప్పటిలాగే విధులకు హాజరై అనంతరం కరీంనగర్‌లోని తన నివాసానికి వెళ్లారు. రాత్రి 11 గంటల సమయంలో ఛాతీలో నొప్పి ఉందని కుటుంబ సభ్యులకు తెలుపగానే వారు హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నట్లు తోటి ఉద్యోగులు పేర్కొన్నారు. కాగా, గుండెపోటుతో అకాల మరణం చెందిన ఎంపీడీవో శ్రీనివాస్‌ను కడసారి చూసేందుకు మండలానికి చెందిన పలువురు రాజకీయ ప్రముఖులు, అధికారులు కరీంనగర్‌లోని ఆయన నివాసానికి చేరుకుని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయనతో వారికున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. బుగ్గారం మాజీ జెడ్పీటీసీ బాదినేని రాజేందర్, నాయకులు వేముల సుభాష్, నగునూరి నర్సాగౌడ్, నగునూరి రాజశేఖర్, సమీద్, జంగ శ్రీనివాస్, ఎంపీవో అఫ్జల్‌మియా, కార్యాలయ సిబ్బంది నివాళులర్పించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


మహమ్మద్ షమీమ్(ఫైల్)

సిరిసిల్లక్రైం: తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ షమీమ్ (46) అప్పుల బాధ భరించలేక ఆదివారం సిరిసిల్ల మానేరు వాగులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల వివరాలు.. మహమ్మద్ షమీమ్ కుటుంబ పోషణ నిమిత్తం టైలరింగ్ పని చేసేవాడు. ఇటీవల తన పెద్ద కుమార్తె వివాహం చేయగా అప్పులయ్యాయి. చిన్న కూతురు వివాహం ఎలా చేయాలనే దిగులుతో పాటు ఇప్పటికీ చేసిన అప్పులు పెరగడంతో అవి తీర్చే దారిలేక మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య కౌసర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిరిసిల్ల టౌన్ పోలీసులు తెలిపారు.





తరలివచ్చి.. మొక్కులు చెల్లించి

వేములవాడ: రాజన్నను ఆదివారం సుమారు 35 వేల మంది దర్శించుకున్నారు. సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారికి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

విద్యానగర్(కరీంనగర్): టీయూడబ్ల్యూజే (ఐజేయూ) కరీంనగర్ జిల్లా శాఖ ఎన్నికలు ఈనెల 11న జరగనున్న నేపథ్యంలో ఆదివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో నామినేషన్ల ప్రక్రియ జరిగింది. ఈ ఎన్నికల్లో వివిధ పదవులకు పోటీ చేసేందుకు 99 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అధ్యక్ష స్థానానికి ఏడుగురు, కార్యదర్శి స్థానానికి ఏడుగురు, 3 ఉపాధ్యక్ష స్థానాలకు 17 మంది, 3 సహాయ కార్యదర్శి స్థానాలకు 18 మంది, కోశాధికారి స్థానానికి ఐదుగురు, జిల్లా కార్యవర్గ సభ్యులు 16 స్థానాలకు 45 నామినేషన్లు వేశారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి బుర్ర సంపత్‌కుమార్ మాట్లాడుతూ, నామినేషన్ల పర్వం ముగిసిందని, 9న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నామినేషన్ పత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించినట్లు పేర్కొన్నారు. ఈ ఎన్నికకు సంబంధించి అన్ని పదవులకు ఏకగ్రీవం కాకుంటే 11న మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎల్ఎండీలోని శ్రీతాపాల లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఫంక్షన్ హాల్‌లో పోలింగ్ నిర్వహిస్తామని వివరించారు. పోలింగ్ అనంతరం అదే రోజు ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియను ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు, జిల్లా అడహక్ కమిటీ కన్వీనర్ నగునూరి శేఖర్ పర్యవేక్షించగా, ఎన్నికల సహాయ అధికారులుగా ఎలగందుల రవీందర్, దూలూరి జగన్మోహన్ వ్యవహరించారు.

రాష్ట్రస్థాయి పరీక్షల పరిశీలకుడిగా ఓదెలు కుమార్


ఓదెలు కుమార్

సప్తగిరికాలనీ(కరీంనగర్): విద్యార్థి విజ్ఞాన్ మంతన్ టాలెంట్ టెస్ట్ పరీక్షల రాష్ట్రస్థాయి పరిశీలకుడిగా ఓదెలు కుమార్ ఎంపికయ్యారు. గత నెల 23, 27 తేదీల్లో దేశవ్యాప్తంగా నిర్వహించిన విద్యార్థి విజ్ఞాన్ మంతన్ టాలెంట్ పరీక్షకు రాష్ట్రంలోని 128 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 25న నల్ల మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ, ఘట్ కేసర్ హైదరాబాద్‌లో ప్రయోగ పరీక్షలు నిర్వహించి 10 మంది విద్యార్థులను జాతీయస్థాయికి ఎంపిక చేయనున్నారు. ప్రయోగ పరీక్షకు పరిశీలకుడిగా చిగురుమామిడి మండలం, ఇందుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు బి.ఓదెలు కుమార్ ఎంపికయ్యారు. ఈసందర్భంగా అతడిని జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్.జనార్దన్ రావు, డీసీఈబీ కార్యదర్శి స్వదేశ్‌కుమార్, అశోక్ రెడ్డి, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్.జయప్రద, ఉపాధ్యాయులు అభినందించారు.

కొడుకును కాపాడబోయి తండ్రి మృతి

- విద్యుదాఘాతంతో దుర్మరణం


రాజమౌళి (ఫైల్)

వెల్గటూర్ (ధర్మపురి): విద్యుత్ షాక్‌కు గురైన కొడుకును కాపాడబోయి తండ్రి మృతిచెందిన ఘటన వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేటలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన పిట్టల రాజమౌళి (37) ఆటో నడుపుకుంటూ జీవిస్తాడు. అతడి నాన్నమ్మ మూడురోజుల క్రితం మృతిచెందింది. ఆదివారం మూడురోజుల కార్యక్రమం నిర్వహించి కుటుంబ సభ్యులందరూ స్నానాల కోసం దగ్గర లోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. అక్కడ స్నానాలు చేస్తుండగా రాజమౌళి కొడుకు రిశ్వంత్‌కు కరెంట్ మోటార్ పైప్ ద్వారా ఒక్కసారిగా విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. కొడుకును కాపాడబోయి రాజమౌళి షాక్‌కు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మోటార్ ఫ్యూజులు తీసివేసి తీవ్రగాయాలపాలైన తండ్రి కొడుకులను కరీంనగర్ హాస్పిటల్‌కు తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే రాజమౌళి మృతిచెందినట్లు తెలిపారు. రిశ్వంత్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ బస్టాండ్‌లో ఆదివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. సుమారు 60 ఏళ్ల వయస్సు గల వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండడంతో ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది 108 ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలుపడంతో మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. సంబంధిత వ్యక్తులు ఎవరైనా ఉంటే వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

హైటెన్షన్ విద్యుత్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నం

- 60 శాతం కాలిన గాయాలతో కొట్టుమిట్టాడుతున్న వ్యక్తి


విద్యుత్ టవర్‌పై తిరుపతి

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన రేగుల తిరుపతి రైల్వేట్రాక్‌పై హైటెన్షన్ విద్యుత్ తీగ పట్టుకుని ఆత్మహత్యకు యత్నించాడు. విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. ఎన్టీపీసీ పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన సాజన్ అనే యువతి ఉపాధి కోసం గోదావరిఖని ప్రాంతానికి వలస వచ్చింది. గోదావరిఖనికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ రేగుల తిరుపతికి ఆమె పరిచయమైంది. వీరిద్దరూ 2008లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. అయితే, మూడేళ్లుగా భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు నడుస్తున్నాయి. దీంతో తిరుపతి అప్పట్లో రెండుసార్లు ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఎన్టీపీసీ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. భార్యాభర్తలను పిలిపించిన పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. అయినా, ఎవరిలోనూ మార్పురాలేదు. ఈక్రమంలో ఆదివారం ఇద్దరూ గొడవపడ్డారు. మనస్తాపం చెందిన తిరుపతి సమీపంలోని రైల్వేట్రాక్ వద్దకు వెళ్లాడు. అక్కడి టవర్ ఎక్కి విద్యుత్ తీగను చేతులతో పట్టుకున్నాడు. హైటెన్షన్ విద్యుత్ కావడంతో ఒక్కసారిగా మంటలు లేచి ఫ్యూజ్ కొట్టేసి సరఫరా నిలిచిపోయింది. ఈప్రమాదంలో తిరుపతి శరీరం సుమారు 60శాతం వరకు కాలిపోయింది. టవర్ మధ్య కాసారంలో తల ఇరుక్కుని విలవిల్లాడుతుండగా.. స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని తిరుపతిని కిందకు దించి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు.. పరిస్థితి విషమంగా ఉందని చెప్పి కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ప్రస్తుతం బాధితుడు కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. ఎస్సై ఉదయ్ కిరణ్ ఘటనపై విచారణ చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో ఆయుధాలు

- యువత చేతుల్లోకి మారణాయుధాలు
- పెళ్లి బరాత్‌లు, బర్త్‌డే వేడుకల్లో హంగామా

'పది రోజుల క్రితం జగిత్యాల జిల్లా సరిహద్దు గ్రామంలో ఓ యువకుడు మద్యం మత్తులో తల్వార్ పట్టుకుని హంగామా సృష్టించగా గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురై పరుగులు పెట్టారు'.

'జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని గోదావరినది సమీపంలో ఓ యువకుడు జన్మదిన వేడుకల్లో ఆయుధంతో కేక్ కట్‌చేసిన వీడియో ఇటీవల వైరల్‌గా మారింది'.


ఆన్‌లైన్‌లో అమ్మకానికి పెట్టిన ఆయుధం

జగిత్యాలక్రైం: యువకులు తమ భవిష్యత్‌ను ఎంచుకునే వయస్సులో మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో ఆయుధాలు కొనుగోలు చేస్తూ హంగామా సృష్టిస్తున్నారు. చాలా మంది యువకులు మద్యం మత్తులో గొడవలకు పాల్పడి కక్షలు పెంచుకుని ప్రత్యర్థులపై దాడులు చేసేందుకు గుట్టు చప్పుడు కాకుండా ఆన్‌లైన్‌లో ఆయుధాలు తెప్పించుకుని వెంట పెట్టుకుని తిరుగుతున్నారు. మద్యం మత్తులో ఉన్న సమయంలో జనసంచారం ఉన్న చోట ఆయుధాన్ని తీసి హంగామా సృష్టించడంతో ప్రజలు భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు తెలుస్తోంది.

నిఘా కరువు

ఏడాది కాలంగా జగిత్యాల జిల్లాలో చాలా మంది యువకులు ఆన్‌లైన్ ద్వారా తమకు అవసరమైన వస్తువులు తెప్పించుకోవడంతోపాటు గుట్టుచప్పుడు కాకుండా మారణాయుధాలను కూడా కొనుగోలు చేస్తున్నారు. వీటిపై నిఘా కరువవడంతో ఇష్టారీతిన తెప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆయుధాలను కుటుంబ సభ్యులకు తెలియకుండా రహస్య ప్రాంతంలో దాచిపెడుతూ, గొడవల సమయంలో వాటిని బయటకు తీస్తుండడం ఆందోళనకర పరిణామం.

బర్త్ డేలు, పెళ్లి వేడుకల్లో..

జిల్లాలో చాలా మంది యువకులు బర్త్ డే, పెళ్లి వేడుకల్లో మారణాయుధాలతో డ్యాన్స్‌లు చేయడంతో పాటు తల్వార్‌లు తిప్పుతూ హంగామా సృష్టించిన ఘటనలు ఉన్నాయి. కొంత మంది యువకులు ఆన్‌లైన్ ద్వారా డమ్మీ తుపాకులు, తల్వార్‌లు, కత్తులు, కీచైన్ రూపంలో ఉన్న మారణాయుధాలు ఆన్‌లైన్‌లో తెప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది.

బీఆర్ఎస్ గద్దె కూల్చివేత


ధ్వంసమైన బీఆర్ఎస్ గద్దె

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం రాజేశ్వర్‌రావునగర్‌లో బీఆర్ఎస్ గద్దెను గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. ఈ ఘటనపై ఆపార్టీ మండల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గద్దె కూల్చినవారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాజేశ్వర్‌రావునగర్‌లో బీఆర్ఎస్ గద్దె నిర్మించి దానిపై కారును సింబల్‌గా పెట్టారు. ఇటీవల ఓ అధికారి గద్దెపై ఉన్న కారును తొలగించాలని చెబితే తాము క్రమశిక్షణ గల కార్యకర్తలుగా కారును తొలగించామని చెప్పారు. కానీ ఇప్పుడు గుర్తు తెలియని వ్యక్తులు గద్దెను కూల్చివేశారని ఆగ్రహించారు. దీని వెనుక అధికార పార్టీ నాయకుల హస్తం ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, నాయకులు కమ్మరి రాజారాం, పిట్ల బాబు, కొమిరిశెట్టి లక్ష్మణ్, హన్మంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రీ క్వార్టర్స్‌కు సీనియర్స్ మహిళల కబడ్డీ జట్టు


ప్రీ క్వార్టర్స్‌కు చేరిన జట్టు

కరీంనగర్‌స్పోర్ట్స్: హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలోని ఫతేమైదాన్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి సీనియర్స్ మహిళల కబడ్డీ చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా జట్టు క్రీడాకారిణులు సత్తా చాటారు. ఈ నెల 7న పోటీలు ప్రారంభం కాగా ఆదివారం పోటీలు ముగిసేసరికి జిల్లా జట్టు ప్రీ క్వార్టర్స్‌కు చేరింది. పూల్ సీ లో ఉన్న జిల్లా జట్టు మేడ్చల్, ఆసిఫాబాద్ జట్లపై అద్భుత విజయాలను నమోదు చేసింది. జట్టు విజయం పట్ల జిల్లా కబడ్డీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్.సంపత్‌రావు, అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ అమిత్‌రావు, మల్లేశ్‌గౌడ్, కోచ్ పద్మ హర్షం వ్యక్తం చేశారు.

పోస్టుమార్టం కోసం మృతదేహం వెలికితీత

ముత్తారం(మంథని): ముత్తారం మండలం లక్కారంలో నవంబర్ 5న వేల్పుల కొమురమ్మ(75) చనిపోగా అంత్యక్రియలు పూర్తి చేశారు. కాగా తన తల్లిని ఇంటిపక్కన ఉండేవారు దూషించడంతో మనోవేదనకు గురై గుండెపోటుతో చనిపోయిందని మృతురాలి కొడుకు శ్రీనివాస్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్సై నరేశ్ కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఆదివారం తహసీల్దార్ సుమన్ ఆధ్వర్యంలో కొమురమ్మ మృతదేహాన్ని సమాధి నుంచి వెలికితీయించగా, వైద్యుడు పోస్టుమార్టం చేశారు. శవపరీక్షల నమూనాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపిస్తామని, కేస్ దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో విద్యార్థికి తీవ్రగాయాలు

కోరుట్లరూరల్: మండలంలోని జోగిన్‌పెల్లి గ్రామానికి చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థి తేలు మణిదీప్ ఆదివారం సాయంత్రం విద్యుత్‌షాక్ తగిలి తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికుల వివరాలు.. తేలు రాజేశం-లక్ష్మి దంపతుల కుమారుడు మణిదీప్ తన స్నేహితులతో కలిసి సాయంత్రం షటిల్ ఆడేందుకు వెళ్లాడు. అందుకోసం విద్యుత్ లైట్లు అమర్చారు. విద్యుత్ సరఫరా కోసం పైనుంచి వెళ్తున్న 11 కేవీ విద్యుత్ లైన్‌కు తీగలు తగిలిస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురయ్యాడు. తీవ్రగాయాలు కావటంతో కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ తరలించినట్లు తెలిసింది.

ప్రమాద రహిత సింగరేణి లక్ష్యం

- నేటినుంచి బొగ్గు గనులపై రక్షణ పోటీలు

జీడీకే-7ఎల్ఈపీ గని ఇన్‌చార్జి మేనేజర్ ఇటీవల ఇసుక బంకర్‌లో పడి మృతిచెందారు. ఈ ప్రమాదం నివారించతగినదే. అయినా, తొందరపాటుతో నిండు ప్రాణం గాల్లో కలిసిందని అధికారులు వివరిస్తున్నారు.

జీడీకే-11గనిలో ఇటీవల ఎల్‌హెచ్‌డీ యంత్రాన్ని పార్క్ చేస్తుండగా.. దాని బకెట్ కిందకు జారిపడి ఆపరేటర్ మృతిచెందాడు. బకెట్‌ను కిందకు దింపిఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదంటున్నారు.

మందమర్రి వర్క్‌షాప్‌లో ఇటీవల ఐరన్ పట్టీలు క్రేన్‌తో వాహనంలో లోడ్ చేస్తుండగా రూఫ్‌వైర్ తెగిపడి కార్మికుడు మృతిచెందాడు. సరైన రూఫ్‌వైర్ వినియోగించినా, కార్మికుడు కొంతదూరంలో ఉన్నా ఈ ప్రమాదాన్ని నివారించే వీలుందని పేర్కొంటున్నారు.


ముస్తాబైన ఓసీపీ క్వారీలోకి వెళ్లే హాలేజీ ప్రధాన రోడ్డు

సింగరేణిలో గత ఏడేళ్లలో జరిగిన ప్రమాదాలు

ఏడాది	మృతులు	తీవ్ర గాయాలు	సాధారణ గాయాలు
2018	7	191	347
2019	8	138	217
2020	12	102	108
2021	13	122	107
2022	05	96	122
2023	05	68	70
2024	06	84	72

గోదావరిఖని(రామగుండం): ప్రమాద రహిత సింగరేణిగా తీర్చిదిద్దడం లక్ష్యంగా యాజమాన్యం సోమవారం నుంచి ఈనెల 21 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనుంది. సంస్థలో ఈఏడాది ఇప్పటివరకు జరిగిన ప్రమాదాల్లో ఆరుగురు ఉద్యోగులు మృతిచెందగా, గతేడాది జరిగిన ఐదు ప్రమాదాల్లో ఐదుగురు చనిపోయారు. ఇవన్నీ నివారించగలిగే ప్రమాదాలేనని, అవగాహన, రక్షణ చర్యలు, జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రమాదాలను అధిగమించవచ్చని, ఈక్రమంలోనే రక్షణ పక్షోత్సవాలు నిర్వహిస్తోంది. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతతోపాటు రక్షణ చర్యలపైనా పూర్తిస్థాయిలో దృష్టి పెడుతోంది.

17 ఓసీపీలు.. 22 భూగర్భ గనులు

సింగరేణిలో 17 ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు(ఓసీపీలు), 22 భూగర్భ గనులు ఉన్నాయి. వాటితోపాటు డిపార్ట్‌మెంట్లలో రక్షణ చర్యలపై పోటీలు నిర్వంచనున్నారు. ఇందుకోసం ఏర్పాటుచేసిన 12 ప్రత్యేక బృందాలు కార్పొరేట్, గనులు, ఓసీపీలు, డిపార్ట్‌మెంట్లలో రక్షణ చర్యలను తనిఖీ చేస్తాయి. డైరెక్టర్ జనరల్ మైన్స్ సేఫ్టీ ఆదేశాల మేరకు వారం నుంచి 15రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

ప్రతీ అంశంపై క్షుణ్ణంగా..

ప్రత్యేక బృందాలు రక్షణ ఓసీపీల్లో భారీ యంత్రాల కదలికలు, సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్, అగ్నిప్రమాదాలపై దృష్టి పెడతాయి. భూగర్భ గనుల్లో స్ట్రాటా కంట్రోల్ మేనేజ్‌మెంట్, సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్, రూఫ్, సైడ్ సపోర్టింగ్‌ను తనిఖీ చేస్తాయి. డిపార్ట్‌మెంట్లలో ఉద్యోగులు, సిబ్బంది కదలికలు, పనిముట్ల తీరు పరిశీలిస్తాయి. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన గనులను ఉత్తమంగా ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేస్తాయి.

నిశితంగా తనిఖీ



ఓసీపీలు, భూగర్భ గనులు, వివిధ డిపార్ట్‌మెంట్లలో రక్షణ చర్యలను ప్రత్యేక బృందాలు నిశితంగా తనిఖీ చేస్తాయి. రక్షణపై దృష్టి సారించాకే బొగ్గు ఉత్పత్తి తీయాలి. ఈవిషయంపై ప్రత్యేక బృందాలతో అధ్యయనం చేస్తాం. – శ్రీనివాస్, కార్పొరేట్ సేఫ్టీ జీఎం

ఆత్మస్థైర్యానికి ప్రతిబింబం జూడో

- కరీంనగర్‌లో సీఎం కప్ రాష్ట్రస్థాయి జూడో పోటీలు
- 27 నుంచి 30 వరకు నిర్వహణ
- 33 జిల్లాల నుంచి హాజరుకానున్న క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు, రెఫరీలు


పోటీలో తలపడుతున్న క్రీడాకారులు (ఫైల్)

కరీంనగర్‌స్పోర్ట్స్: చేతిలో ఎలాంటి ఆయుధం లేకున్నా ప్రత్యర్థుల దాడిని ఎదుర్కొంటూ, ఎదుటివారికి హాని కలగకుండా మట్టి కరిపించే యుద్ధ క్రీడ జూడో. పురాతన కాలంలోనే జూడో క్రీడకు క్రేజీ ఉండేదని వినికిడి. ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యానికి ప్రతిబింబంగా నిలిచే జూడో క్రీడను అందరూ నేర్చుకోవాలంటున్నారు శిక్షకులు. కాగా ఈ నెల 27 నుంచి 30 వరకు కరీంనగర్‌లో సీఎం కప్- 2024 రాష్ట్రస్థాయి జూడో పోటీలు జరగనున్నాయి. సీఎం కప్- 2024 పోటీల్లో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు రాష్ట్రస్థాయి పోటీలను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్స్) కేటాయించడం విశేషం.

2016లో జాతీయ పోటీలు

జాతీయ పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల సౌజన్యంతో 2016లో 62వ జాతీయస్థాయి పాఠశాలల అండర్-17 బాలబాలికల జూడో పోటీలకు జిల్లా ఆతిథ్యమిచ్చింది. అంతేకాకుండా సుమారు 20 సంవత్సరాలుగా ఏటా జూడో సంఘం ఆధ్వర్యంలో మానేరు పాఠశాలలో రాష్ట్ర జూడో పోటీలు జరగడం విశేషం. గతేడాది క్రీడా పాఠశాలలో అండర్-17 రాష్ట్ర పోటీలు, కరీంనగర్‌లోని మానేరు పాఠశాలలో జూనియర్స్ విభాగంలో, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో సబ్ జూనియర్స్ విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలు జరిగాయి.

33 జిల్లాల నుంచి..

తొలిసారిగా సీఎం కప్ రాష్ట్రస్థాయి జూడో పోటీలు కరీంనగర్‌లో జరగనుండగా 33 జిల్లాల నుంచి సుమారు 594 మంది క్రీడాకారులు, 132 మంది కోచ్లు, మేనేజర్లు, 20 మంది రెఫరీలు హాజరుకానున్నారు. 12 నుంచి 16 సంవత్సరాల మధ్య వయస్సు గల క్రీడాకారులకు జూనియర్స్ విభాగంలో పోటీలు జరగనున్నాయి. 2008 నుంచి 2012 మధ్య పుట్టిన వారు పోటీలకు అర్హులు.

నగదు బహుమతులు

సీఎం కప్ రాష్ట్ర పోటీల్లో తొలి మూడుస్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు నగదు పారితోషికాలను ప్రభుత్వం ప్రకటించింది. బంగారు పతకానికి రూ.20 వేలు, రజత పతకానికి రూ.15 వేలు, కాంస్య పతకానికి రూ.10 వేలు ఇవ్వనున్నారు. కాగా జూనియర్స్ విభాగాల్లో 9 వెయిట్ కేటగిరీలో పోటీలు జరగనుండగా మొత్తం రూ.9 లక్షల 90 వేల నగదు బహుమతులు క్రీడాకారులకు దక్కనున్నాయి.

బాలుర వెయిట్ కేటగిరీలు
30,35,40,45,50,55,60,66 కేజీల లోపు, 66 కేజీల పైన..

బాలికల వెయిట్ కేటగిరీలు
36,40,44,48,52,57,63,70 కేజీల లోపు, 70 కేజీలపైన..

కరీంనగర్‌కు కేటాయించడం సంతోషకరం



తెలంగాణలో కరీంనగర్ జిల్లా జూడో క్రీడకు పెట్టింది పేరు. కేవలం మానేరు విద్యాసంస్థలకు జూడో క్రీడకు సుమారు 20 ఏళ్ల అనుబంధం ఉంది. ఇప్పటి వరకు 15కు పైగా రాష్ట్ర పోటీలు ఒక సారి జాతీయస్థాయి పోటీలను అట్టహాసంగా నిర్వహించాం. సీఎం కప్ పోటీలను సైతం ఘనంగా అందరం కలిసి నిర్వహిస్తాం.
– కదారి అనంతరెడ్డి, రాష్ట్ర జూడో సంఘం ఉపాధ్యక్షుడు, మానేరు విద్యాసంస్థల అధినేత

అట్టహాసంగా నిర్వహిస్తాం



జూడో పోటీల్లో పాల్గొనేందుకు 33 జిల్లాల నుంచి రానున్న క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉన్ని ఏర్పాట్లు చేస్తాం. అట్టహాసంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. పోటీల విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.
– శ్రీనివాస్‌గౌడ్, డీవైఎస్‌వో, కరీంనగర్

పతకాలు సాధిస్తాం



జిల్లాలో జూడో క్రీడాకారులకు కొదువ లేదు. జాతీయస్థాయిలో సత్తా చాటిన క్రీడాకారులు ఉన్నారు. సీఎం కప్ రాష్ట్ర పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పెద్ద సంఖ్యలో సత్తాచాటి పతకాలు సాధిస్తారు.
– బి.సాయిరాంయాదవ్, క్రీడా పాఠశాల జూడో కోచ్, కరీంనగర్

అందరి సహకారంతో..



శాట్స్ అధికారులు కోరగానే జూడో క్రీడను కరీంనగర్‌కు కేటాయించడం సంతోషకరం. సీఎం కప్ పోటీలను మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగంతో కలిసి విజయవంతం చేస్తాం.
– గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి